క్లుప్తంగా

మరిడమ్మ సన్నిధిలో చిన్నశ్రీను



అమ్మవారి ఆలయంలో మజ్జి శ్రీనివాసరావు

తగరపువలస: వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు నమ్మివానిపేట మరిడమ్మ వారిని మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు అక్కడికి వచ్చిన ఆయనకు ఆలయ కమిటీ అధ్యక్షుడు నమ్మి మాధవరావు ఆధ్వర్యంలో అర్చకుడు రామాయణం కామేశ్వరశర్మ సాదర స్వాగతం పలికారు. చిన్న శ్రీను, ఆయన కుటుంబ సభ్యుల పేరిట అర్చకులు ప్రత్యేక కుంకుమపూజ చేశారు. ఆయన వెంట స్థానిక నాయకులు పాల్గొన్నారు.

'కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి'

భీమునిపట్నం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి గురించి పార్టీలో అందరూ ప్రజలకు వివరించాలని బీజేపీ మండల అధ్యక్షుడు ఉళ్ల కొండబాబు సూచించారు. భీమిలిలోని పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులతో మంగళవారం నిర్వహించిన వికసిత భారత్ సంకల్ప సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ 11 ఏళ్ల పాలన పూర్తయిందని, అద్భుతమైన పాలనను అందించడంతో పాటు, దాన్ని కొనసాగిస్తున్నారన్నారు. రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ కేశవకాంత్ ప్రసంగించారు. నాయకులు కంటుభుక్త సునీత, వాసుపల్లి శ్రీహరి, పోలుబోతు విజయ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యామిత్ర కిట్ల పంపిణీ



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న పీపీసీఎస్ అధ్యక్షుడు రామునాయుడు

తగరపువలస: సంతపేట అంబేడ్కర్ జీవీఎంసీ హైస్కూల్ విద్యార్థులకు పీపీసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు చేతుల మీదుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లను మంగళవారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు నిబద్ధతతో విద్యార్థులకు బోధన చేయాలన్నారు. విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు జీవీ రమణ, కొప్పల రమేష్, పిట్ట సురేష్, పరిమి భువనేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ కరాటే పోటీలకు ఆరుగురు ఎంపిక



క్రీడాకారులకు జెర్సీలు అందజేస్తున్న నిర్వాహకులు

మధురవాడ: అంతర్జాతీయ కరాటే పోటీలకు నేషనల్ షాటో కరాటే అసోసియేషన్ నుంచి ఆరుగురు క్రీడాకారులు ఎంపికైనట్లు ఆంధ్రప్రదేశ్ జట్టుకు నాయకత్వం వహిస్తున్న మధురవాడకు చెందిన పీవీ రమణ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 19 నుంచి 22 వరకు కౌలాలంపూర్‌లో 24వ మిలో ఇంటర్నేషనల్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. వీరిలో మహారాష్ట్రకు చెందిన సంజయ్ ఇంగోల్, ఎండాడకు చెందిన పీఎం దినేష్, విశాఖ హెచ్‌బీ కాలనీకి చెందిన కె. కేశవ్, ఎంవీపీ కాలనీకి చెదిన పీవీ గోవర్ధన్ సాయి, పీఎం పాలేనికి చెందిన కిషన్ సాయి, పనోరమ హిల్స్‌కి చెందిన ఎస్.దియా ఎంపికైనట్లు తెలియజేశారు. వీరికి మధురవాడలో జరిగిన ఓ కార్యక్రమంలో ఎన్ఎస్‌కేఏఐ చీఫ్ షిహాన్ సంజయ్ ఇంగోల్ క్రీడాకారులకు జెర్సీలు అందజేశారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడా మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.



భీమిలి మండలం తాళ్లవలస పంచాయతీ వలందపేట శివారులో అధ్వానంగా డ్రైనేజీలు



ఆనందపురం మండలం బోని పంచాయితీలో నాచు కట్టిన వీధి కుళాయి ప్లాట్‌ఫాం

ఫోకస్

క్షీణించిన పారిశుధ్యం

వణుకుతున్న గ్రామాలు • కానరాని చర్యలు





పద్మనాభం మండలం ఏనుగులపాలెం గ్రామంలో రోడ్డుమీదుగా పారుతున్న మురుగునీరు

తగరపువలస: భీమిలి నియోజకవర్గంలోని గ్రామ పంచాయతీలలో పారిశుధ్యం క్షీణించింది. ఇప్పటికే అడపాదడపా వర్షాలు ప్రారంభం కావడం, సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే కాలం కావడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కంపు కొడుతున్న శివారు గ్రామాలు

గ్రామ పంచాయతీలలో ప్రధాన వీధులు మినహా మిగిలిన శివారు గ్రామాలు మురికిపట్టి ఉంటున్నాయి. డ్రైనేజీలు నిండిపోయి, కంపు గొడుతున్నాయి. అవుట్‌లెట్లు లేక పొంగిపొర్లుతున్నాయి. చాలావరకు అసంపూర్తి డ్రైనేజీల కారణంగా మురుగు గ్రామాలలో నిలిచిపోతోంది. చెరువులు, నదీ ముఖద్వారాలు చెత్తపోగులు, డెబ్రిస్‌లతో నిండిపోతున్నాయి. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలించేందుకు వాహనాలు లేక గ్రామ పంచాయతీలు విలవిలలాడుతున్నాయి. పుస్తకాలలో మినహా బ్లీచింగ్ బ్యాగులు తెరచుకోవడం లేదు.

మూలకు చేరిన ప్రజా మరుగుదొడ్లు

చాలా పంచాయతీలలో పబ్లిక్ టాయిలెట్లు మూలకు చేరాయి. భీమిలి మండలం మజ్జివలస, శింగనబంద పంచాయతీలలో టాయిలెట్లను నిర్మించిన తరువాత ప్రారంభించనే లేదు. దీంతో రహదారులు, వ్యవసాయభూములు బహిరంగ మలవిసర్జనకు వినియోగిస్తున్నారు. శిథిలమైన రహదారులపై వర్షంనీరు నిలిచి చెరువులను తలపిస్తోంది. గ్రామాల నడుమ అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు ఉంటున్నందున పారిశుధ్య పనులపై దృష్టి సారించి, దోమల నివారణకు రసాయనాలు పిచికారీ చేయించాలని గ్రామీణులు కోరుతున్నారు.



బోనిలో మరమ్మతులకు నోచుకోని పబ్లిక్ టాయిలెట్లు

కురపల్లిలో మరీ అధ్వానం

పద్మనాభం: పాండ్రంగి పంచాయతీ కొత్త కురపల్లి గ్రామం ప్రవేశంలోను, రక్షిత మంచినీటి పథకం సమీపంలో రోడ్డును ఆనుకుని చెత్త వేయడంతో ఆ ప్రాంతమంతా చెత్తతో నిండి ఉంది. పాత కురపల్లి రక్షిత మంచినీటి పథకం సమీపంలో ఆర్అండ్‌బీ రోడ్డు పక్కన డ్రైనేజీ చెత్త చెదారంతో పూడుకుపోయింది. మురుగు ప్రవహించకుండా ఎక్కడికక్కడే నిలిచిపోతోంది. ఈ డ్రైనేజీ పక్కనే చెత్త ఉంది. రేవిడి జంక్షన్‌కు సమీపంలో ఆర్అండ్‌బీ రోడ్డును అనుకుని చెత్త ఉంది. వర్షాలు కురుస్తుండడంతో చెత్త కుళ్లిపోయి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. దీని వల్ల దోమలు వృద్ధి చెంది, రాత్రి వేళల్లో ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పారిశుధ్య లోపం కారణంగా డయేరియా, ఫైలేరియా వంటి వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉంచాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



పాత కురపల్లిలో మురుగు కాలువ, పక్కనే చెత్త



రేవిడి జంక్షన్‌కు సమీపంలో ఆర్అండ్‌బీ రోడ్డు పక్కన చెత్త



కొత్త కురపల్లి గ్రామ ప్రవేశంలో రోడ్డును అనకుని ఉన్న చెత్త కుప్ప

విద్యుత్ శాఖ సిబ్బంది రుబాబు

ఏఏవోకు వినియోగదారుల ఫిర్యాదు



ఏఏవోకు ఫిర్యాదు చేస్తున్న వినియోగదారుడు

మధురవాడ: విద్యుత్ శాఖ కార్యాలయ సిబ్బంది తీరుపై వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయాల సముదాయంలో ఉన్న ఈఆర్‌వో (విద్యుత్ శాఖ రెవెన్యూ కార్యాలయం) వద్ద తల్లికి వందనం నిధులు జమ కాని వినియోగదారులు స్టేట్‌మెంట్ల కోసం మంగళవారం భారీగా క్యూ కట్టారు. ఆ సమయంలో అక్కడి పురుష సిబ్బంది మహిళలను కూడా చేతితో తాకి బయటకు నెడుతున్నారని వినియోగదారులు వాపోయారు. విషయం బయటకు వచ్చి పత్రికా విలేకరులు ఫొటోలు తీసే ప్రయత్నం చేయడంతో ఓ ఉద్యోగి ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు, తిరిగి ఫొటోలు తీస్తూ బెదిరింపులకు దిగారు. వీరి తీరుపై ఏఏఈ రమాదేవిని వివరణ కోరే ప్రయత్నం చేయగా జేఏవో స్పందిస్తూ తమకూ యూనియన్లు ఉన్నాయని, తమకి సంబంధం లేని పని చేయిస్తున్నారని ఎదురుతిరిగారు. దీంతో వినియోగదారులతో సక్రమంగా నడుచుకోవాలని ఆమె సిబ్బందిని ఆదేశించారు. ప్రవర్తనలో మార్పు రాకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పద్మనాభం: పద్మనాభం, బోని సబ్‌స్టేషన్ ఫీడర్ లైన్లలో ఆర్‌డీఎస్ఎస్ పనులు చేపట్టనున్నందున ఆ పరిధిలోని గ్రామాలకు బుధవారం ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ జగన్మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. పద్మనాభం, కృష్ణాపురం, శేరిఖండం, రెడ్డిపల్లి, పొట్నూరు, తునివలస, నరసాపురం, చిన్నాపురం, నేరేళ్లవలస, విజయానందపురం, మద్ది, బాందేవుపురం, విలాస్కాన్‌పాలెం, విజయరాంపురం, కురపల్లి, అనంతవరం, గంధవరం, పెంట, కొవ్వాడ, తిమ్మాపురం, పాండ్రంగి, సామయ్యవలస గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలియజేశారు.

తరగతుల విలీనంపై ఆందోళన



తరగతుల విలీనం నిలిపివేయాలని ఆందోళన చేస్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

పద్మనాభం: పద్మనాభం పంచాయతీ ఇసకలపాలెం ప్రాథమిక పాఠశాలలో మూడు నుంచి ఐదు తరగతులను పద్మనాభం మోడల్ ప్రైమరీ పాఠశాలలో విలీనం చేయడాన్ని నిలిపివేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఇసకలపాలెం ప్రాథమిక పాఠశాల వద్ద మంగళవారం ధర్నా చేశారు. ఐదు తరగతులను ఇసకలపాలెంలో కొనసాగించాలని, విలీనాన్ని నిలిపి వేయాలని నినాదాలు చేశారు. 50 ఏళ్ల నుంచి ఉన్న ఇసకలపాలెం ప్రాథమిక పాఠశాలలో మూడు నుంచి ఐదు తరగతులను వేరే పాఠశాలలో విలీనం చేయడం సరికాదన్నారు. ఇసకలపాలెం నుంచి పద్మనాభం చేరుకునేందుకు విజయనగరం–కొంత్యాం ఆర్అండ్‌బీ రోడ్డును దాటి వెళ్లాల్సి వస్తుందని, ఈ క్రమంలో ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు కలవరపడుతున్నారు. ఈ తరగతులను ఇక్కడే కొనసాగించాలని కోరుతూ ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్, ఇసకలపాలెం ఉపాధ్యాయుడు ఎ.ఆదిబాబుకు ఎస్ఎంసీ చైర్మన్ హంస జ్యోతి, వైస్ చైర్మన్ ముచ్చుపల్లి భారతి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు హంస మహేష్, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దువ్వుపేటలోనే తరగతుల కొనసాగింపునకు వినతి

పద్మనాభం: కోరాడ పంచాయతీ దువ్వుపేటలోనే ఐదు తరగతులు నిర్వహించాలని విద్యార్థుల తల్లిదండ్రులు మంగళవారం ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్‌కు వినతి పత్రం ఇచ్చారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోను కలిసి, వినతి పత్రం అందజేశారు. దువ్వుపేటలోని మూడు నుంచి ఐదు తరగతులను కోరాడ మోడల్ ప్రైమరీ పాఠశాలలో విలీనం చేయడాన్ని నిలిపివేయాలని కోరారు.

22న 'గీతం' ప్రవేశ పరీక్ష

కొమ్మాది: గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ద్వారా నిర్వహిస్తున్న బీఎస్సీ, ఎంఎస్సీ కోర్సుల్లో ప్రవేశానికి జూన్ 22వ తేదీన జరిగే గీతం అడ్మిషన్ టెస్ట్ (గ్యాట్)-2025 ద్వారా ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. వేదవతి తెలిపారు. గ్యాట్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు పూర్తి వివరాల కోసం గీతం వెబ్‌సైట్ www. gitam.edu ను పరిశీలించాలని సూచించారు.

ఆదమరిచారా.. అంతే



ప్రమాదకరంగా మ్యాన్‌హోల్

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటోవార్డు చిట్టివలస రంగూరి లే అవుట్‌లో మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా తెరుచుకుని ఉంది. చీకటి పడిన తరువాత ఈ ప్రాంత ప్రజలు తరచూ ఇందులో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం స్పందించి, ఇక్కడ మ్యాన్‌హోల్‌పై మూత వేయాలని స్థానికులు కోరుతున్నారు.

ముందు వెళ్తున్న లారీని ఢీకొని వ్యక్తి మృతి



మృతుడు మహేష్

పీఎం పాలెం: జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న లారీని ఢీ కొనడంతో ఓ వ్యక్తి మరణించాడు. ఘటనకు సంబంధించి పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలివి.. మంగళవారం సాయంత్రం 6గంటల సమయంలో జాతీయ రహదారిపై విశాఖపట్నం నుంచి ఆనందపురం వైపు ఓ లారీ వెళ్తోంది. ఈ క్రమంలో లారీ కొమ్మాది కూడలి దాటిన తరువాత డ్రైవర్ వేగం తగ్గించి, ఆపివేశారు. దీంతో లారీ వెనుకే ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఎస్.మహేష్ (33) ముందు వెళ్తున్న లారీని ఢీ కొని, తీవ్ర గాయాలపాలయ్యాడు. క్షతగాత్రుని చికిత్స నిమిత్తం సమీపంలోని గాయత్రి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించాడు. మృతుడు భీమిలి మండలం మజ్జివలస గ్రామస్తునిగా పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

స్టూడెంట్ వెల్ఫేర్ డీన్‌గా హరనాథ్



మద్దిలపాలెం: ఆంధ్రా యూనివర్సిటీ స్టూడెంట్ వెల్ఫేర్ డీన్‌గా సోషల్ వర్క్ విభాగాధిపతి ఆచార్య ఎస్.హరనాథ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు ఆచార్యులు ఆయనను అభినందించారు.

అందరి సహకారంతో 'యోగాంధ్ర' విజయవంతం



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు



మాట్లాడుతున్న ఎంపీపీ రాంబాబు

భీమునిపట్నం: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 21న నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు అందరూ సహకరించాలని భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ కోరారు. యోగాపై అవగాహన కల్పిస్తూ విద్యార్థులు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శారీరక ఆరోగ్యానికి, మానసిన ప్రశాంతతకు యోగా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అందరూ యోగాను దైనందిన చర్యలో భాగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యోగాంధ్రకు తరలి రావాలి

పద్మనాభం: విశాఖ బీచ్ రోడ్డులో ఈ నెల 21న నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ కంటుబోతు రాంబాబు కోరారు. యోగాంధ్రపై మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధిక సంఖ్యలో ప్రజలు బీచ్ రోడ్డుకు తరలి వెళ్లాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్, ఈవోఆర్డీ మీనా కుమారి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కె.దామోదరరావు పాల్గొన్నారు.

పూడిక తీసి.. వదిలేశారు

- రోడ్డుపైనే వ్యర్థాలు, బురద
- దుర్గంధంతో ప్రయాణికుల అవస్థలు



కారుషెడ్ నుంచి కొమ్మాది వెళ్లే సర్వీసు రోడ్డులో ఇదీ పరిస్థితి..

పీఎం పాలెం: కారుషెడ్ కూడలి నుంచి కొమ్మాది కూడలికి వెళ్లే సర్వీసు రోడ్డు పొడవునా ఉన్న డ్రైనేజీ పూడిక నుంచి భరింపరాని దుర్గంధం వెలువడుతోందని ఆ రోడ్డులో ప్రయాణించే వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ పారిశుధ్య విభాగ సిబ్బంది ఇటీవల డ్రైనేజీలో పూడిక తొలగింపు పనులు చేపట్టారు. అందులో భాగంగా డ్రైనేజీపై పలకలు తీసి, వ్యర్థాలను తొలగించి, పోగు పెట్టారు. దీంతో ఆ కుళ్లిన వ్యర్థాల నుంచి విపరీతమైన దుర్గంధం వెలువడుతోంది. అడపాదడపా కురుస్తున్న వర్షాలకు ఆ పూడిక బురదగా మారి రోడ్డంతా విస్తరించింది. వేసవిలో పనులు చేపడితే ఈ ఇబ్బంది ఉండేది కాదని, వర్షాల కారణంగా సమస్య మరింత తీవ్రంగా మారిందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు పలకలు తొలగించడంతో పాదచారులకు ఫుట్‌పాత్ సౌకర్యం లేకుండా పోయింది. సంబంధిత అధికారులు స్పందించి బురద విస్తరించిన ప్రాంతమంతా బ్లీచింగ్ చల్లించాలని, పూడికను వెంటనే తొలగించి, పలకలను యథాస్థితిలో పెట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఏయూ శతాబ్ది ఉత్సవాలపై చర్చ



పూర్వ విద్యార్థుల సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, వీసీ రాజశేఖర్

మద్దిలపాలెం : ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది సంవత్సర వేడుకల్లో భాగంగా పూర్వ విద్యార్థుల సంఘం సమావేశం మంగళవారం ఏయూలో జరిగింది. ఈ సమావేశంలో ఏయూ ఉపకులపతి ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఈఎస్. ధనుంజయ రావు, రెక్టార్ ప్రొఫెసర్ ఎస్. కిషోర్ హాజరయ్యారు. పూర్వ విద్యార్థుల సంఘం వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ జీఎం. రావు, బీవీఎస్. రావు వర్చువల్‌గా హాజరయ్యారు. వారు సంఘం భవిష్యత్తు దృక్పథం, కార్యకలాపాలపై వివరణాత్మక వివరణ ఇచ్చారు. ఆంధ్రా యూనివర్సిటీ మాజీ ఉపకులపతి బీలా సత్యనారాయణ, ఏపీఏ మాజీ చైర్మన్ గంటా శ్రీనివాసరావు, శంకర్ ఈ సమావేశంలో పాల్గొని విలువైన సలహాలు ఇచ్చారు. ఈ వర్క్‌షాప్‌లో ఏయూ పూర్వ విద్యార్థుల సంఘం దార్శనికత, లక్ష్యం, విలువలను అధికారికంగా రూపొందించారు. అలాగే పూర్వ విద్యార్థుల సంఘం కొత్తగా పునరుద్ధరించిన వెబ్‌సైట్‌ను అధికారికంగా ప్రారంభించారు. డిసెంబర్ 2025లో జరగనున్న వార్షిక పూర్వ విద్యార్థుల సమావేశం ప్రణాళిక అమలుపై కూడా చర్చించారు. శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న పూర్వ విద్యార్థుల నుంచి ఉత్సాహంగా పాల్గొనేలా అన్ని చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్, డీన్స్, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు, ఏయూ ప్రొఫెసర్లు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

యోగాంధ్రకు సిద్ధమవుతున్న జోడుగుళ్లుపాలెం బీచ్‌రోడ్డు



జోడుగుళ్లుపాలెం వద్ద ఒక వైపు రోడ్డు మూసేసిన పోలీసులు



జోడుగుళ్లుపాలెం వద్ద బీచ్‌రోడ్డులో ఒకవైపు వేసిన పచ్చని మ్యాట్

ఆరిలోవ: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈ నెల 21న జరగనున్న 'యోగాంధ్ర' కార్యక్రమం కోసం బీచ్ రోడ్డులో అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా తెన్నేటి పార్కు, జోడుగుళ్లపాలెం, సీతకొండ సీ వ్యూ పాయింట్‌ల వద్ద మూడు యోగా పాయింట్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఏర్పాట్లలో భాగంగా మంగళవారం బీచ్ రోడ్డుకు ఒకవైపు వాహన రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. నిలిపివేసిన రోడ్డు భాగంలో పచ్చని మ్యాట్‌లను పరిచారు. సీతకొండ వద్ద కొండచరియలు జారి రోడ్డుపై పడకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు. కొండ అంచున ఇనుప రాడ్లతో బారికేడ్‌లను ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా, బీచ్‌రోడ్డులో ఒక వైపు రోడ్డును పూర్తిగా మూసివేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

కార్మికుల సమస్యలపై వినతి పత్రాలు



జేఎల్‌సీకి వినతిపత్రం అందిస్తున్న కార్మిక సంఘాల ప్రతినిధులు

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లు కార్మికులకు మిల్లు యాజమాన్యం బకాయిలు చెల్లించేవరకు మిల్లు ఆస్తులు విక్రయించకుండా చూడాలని కోరుతూ ఐక్య కార్మిక సంఘాల ప్రతినిధులు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, జాయింట్ లేబర్ కమిషనర్‌కు మంగళవారం వినతి పత్రాలు అందించారు. అప్రెంటిస్, బదిలీ, స్పెషల్ బదిలీ, న్యూ బదిలీ కార్మికులకు పీఎఫ్, వేతన బకాయిలు ఇవ్వాలన్నారు. వితంతువులకు ఇస్తామన్న రూ.5వేలు, యాజమాన్యం వద్ద ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేసిన వారికి పెన్షన్లు మంజూరు చేస్తూ మారుపేరు కార్మికులకు న్యాయం చేయాలన్నారు. వినతిపత్రాలు అందించిన వారిలో జీరు వెంకటరెడ్డి, చిల్ల వెంకటరెడ్డి, దల్లి అప్పలరెడ్డి, కొండపు ఈశ్వరరావు, మునకాల ఆదినారాయణరెడ్డి, చిల్ల రాంపైడి పాల్గొన్నారు.